క్లుప్తంగా

పాస్టర్లపై దాడులు బాధాకరం



నెహ్రూనగర్: మత మార్పిడిల పేరుతో క్రైస్తవ మందిరాలు, పాస్టర్లపై దాడులు చేయడం బాధాకరమని అసోసియేషన్ ఇంటిగ్రేటెడ్ క్రిస్టియన్ కౌన్సిల్ (ఏఐసీసీ)రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లెల రాజు పేర్కొన్నారు. నగరంలో ఏఐసీసీ ముఖ్య నాయకుల సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో చర్చిలు, పాస్టర్లపై దాడుల్ని ఐక్యతతో అడ్డుకుంటామని చెప్పారు. సమావేశంలో అసోసియేషన్ జిల్లా ప్రెసిడెంట్ స్టాన్లీబాబు, మార్క్, పాస్టర్లు దాసు, మణి, సుధీర్‌కుమార్, ఆనంద్, ప్రశాంత్ రాజ్, రవిచంద్ర పాల్గొన్నారు.

రాష్ట్ర యువజన కాంగ్రెస్ లీగల్ సెల్ చైర్మన్‌గా అశోక్



పాత గుంటూరు: రాష్ట్ర యువజన కాంగ్రెస్ లీగల్ సెల్ చైర్మన్‌గా గాలి అశోక్ ఆనంద్ నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం విశాఖపట్నంలో జరిగిన కాంగ్రెస్ శిక్షణ శిబిరంలో యువజన కాంగ్రెస్ లీగల్ సెల్ జాతీయ చైర్మన్ రూపేష్ ఎస్. బదురియ, జాతీయ యువజన కాంగ్రెస్ ఇంచార్జ్ శ్రీ కృష్ణ అల్వార్, పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, కార్యనిర్వాహక అధ్యక్షుడు రాకేష్ రెడ్డి నుంచి నియామక పత్రాన్ని అశోక్ ఆనంద్ అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన జాతీయ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బి.వి. శ్రీనివాస్, రాష్ట్ర అధ్యక్షుడు రామారావుకు ధన్యవాదాలు తెలిపారు.

ఉర్దూ బాలుర కళాశాల, హాస్టల్‌కు స్థల పరిశీలన



గుంటూరు ఎడ్యుకేషన్: పాత గుంటూరు నందివెలుగు రోడ్డులో ఓ ప్రైవేటు భవనంలో నిర్వహిస్తున్న ఏపీఆర్‌జేసీ ఉర్దూ బాలుర కళాశాల, హాస్టల్‌కు సొంత భవన నిర్మాణం చేపట్టేందుకు గానూ జేసీ జి. రాజకుమారి గురువారం స్థల పరిశీలన చేశారు. సొంత భవన నిర్మాణం కోసం స్థలాన్ని కేటాయించాలని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహ్మద్ ముస్తఫా ఇటీవల జిల్లా అధికార యంత్రాగాన్ని కోరడంతో జేసీ రాజకుమారి, గుంటూరు ఆర్డీవో ప్రభాకరరెడ్డితో కలసి స్థల పరిశీలన చేశారు. కాగా నందివెలుగురోడ్డులో గురుకుల కళాశాల, హాస్టల్‌కు 2003లోనే స్థలాన్ని అప్పగించినట్లు ఆర్డీవో ఆమె దృష్టికి తీసుకెళ్లారు. భవన నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలియజేశారు.

ఆస్తి, ఖాళీ స్థలాల పన్నులపై వడ్డీ మాఫీ

నెహ్రూనగర్: నగరపాలక సంస్థకు చెల్లించాల్సిన ఆస్తి పన్ను, ఖాళీ స్థలాల పన్నులపై వడ్డీ మాఫీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసినట్లు నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. పన్ను బకాయిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. ఈ నెలాఖరులోపు పన్నుల్ని చెల్లించి నగరాభివృద్ధికి సహకరించాలని ఆమె పట్టణ ప్రజల్ని కోరారు.

నష్టపరిహారంగా లక్ష చెల్లించండి

ఎస్‌బీఐ క్రెడిట్ కార్డు విభాగానికి కమిషన్ ఆదేశం

గుంటూరు లీగల్ : స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా క్రెడిట్ కార్డు విభాగం ఫిర్యాది పి.సుకుమార్‌కు రూ.1,35,453 చెల్లించాలని గుంటూరు జిల్లా వినియోగదారుల కమిషన్ గురువారం ఆదేశించింది. గుంటూరులోని చంద్రమౌళీనగర్‌కు చెందిన సుకుమార్ ఎస్‌బీఐలో చీఫ్ మేనేజర్‌గా పని చేస్తున్నారు. ఆయన ఎస్‌బీఐ క్రెడిట్ కార్డును తీసుకొని లావాదేవీలు జరుపుతున్నారు. దాన్నుంచి ఆయనకు తెలియకుండా రూ.32,453 కట్ అయ్యాయి. ఈ విషయం నెలవారీ స్టేట్‌మెంట్‌లో తెలిసిన వెంటనే ఎస్‌బీఐని సంప్రదించారు. ఓటీపీ రాకుండానే డబ్బులు కట్ అయినందున తిరిగి తన ఖాతాకు జమ చేయాలని కోరారు. నోటీసులు కూడా పంపించారు. ఎస్‌బీఐ క్రెడిట్ కార్డు విభాగం తమకు సంబంధం లేదని సమాధానం పంపింది. దీంతో సుకుమార్ వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు. ఇరువురి వాదనలు విన్న కమిషన్ అధ్యక్షురాలు తాడికొండ సునీత, సభ్యులు కె.విజయలక్ష్మి, జి.పున్నారెడ్డి తీర్పు వెలువరించారు. ఫిర్యాది సుకుమార్‌కు క్రెడిట్ కార్డు నుంచి కట్ అయిన రూ.32,453తో పాటు నష్టపరిహారం కింద రూ.1లక్ష, ఫిర్యాదు ఖర్చుల కింద రూ.3వేలు ఆర్నెలల్లో చెల్లించాలని ఎస్‌బీఐ క్రెడిట్ కార్డు విభాగం వారిని ఆదేశించారు. ఫిర్యాదు తరఫున న్యాయవాది డి.రవీంద్రబాబు వాదించారు.

వీధి కుక్కల పట్టివేత

పెదకాకాని: కుక్కలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గ్రామ సర్పంచ్ గోళ్ల స్వరూపరాణి సూచించారు. గ్రామంలో కుక్కల బెడద అధికంగా ఉండటంతో గురువారం బయటి నుంచి కూలీలను పిలిపించి మొత్తం 50 కుక్కలను పట్టించినట్లు ఆమె చెప్పారు.

పొట్టి శ్రీరాములు జీవితం స్ఫూర్తిదాయకం

కొరిటెపాడు(గుంటూరు): గాంధేయ మార్గంలో ఆంధ్ర రాష్ట్రం సాధించిన గొప్ప మహనీయుడు అమరజీవి పొట్టి శ్రీరాములు అని గుంటూరు మార్కెట్ యార్డు చైర్మన్ మద్దిరెడ్డి సుధాకరరెడ్డి కొనియాడారు. ఆయన జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకల్నిమిర్చి యార్డు ఆవరణలోని సమావేశ మందిరంలో గురువారం నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా యార్డు చైర్మన్ సుధాకరరెడ్డి మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు ఆశయం, త్యాగం ఎప్పటికీ వృథా కాదన్నారు. ఆయన్ను స్ఫూర్తిగా తీసుకొని ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో యార్డు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న యార్డు చైర్మన్ సుధాకరరెడ్డి తదితరులు

ఆంధ్రుల మదిలో చిరస్మరణీయులు

లక్ష్మీపురం: ఆంధ్రుల మదిలో పొట్టి శ్రీరాములు చిరస్మరణీయులని విద్యావేత్త ఆర్.వి.సింగరయ్య పేర్కొన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో గురువారం కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో గురువారం పొట్టి శ్రీరాములు జయంతి వేడుకల్ని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సింగరయ్య మాట్లాడుతూ అమరజీవి త్యాగం వల్లే భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడ్డాయని వివరించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు ప్రసాద్, పి.ఎస్. మూర్తి, అవధానుల హరి, మురళీకృష్ణ పాల్గొన్నారు.

అమరజీవి త్యాగం మరువలేనిది

గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్ర రాష్ట్రం కోసం అమరజీవి త్యాగం మరువలేనిదని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్ తెలిపారు. అరండల్‌పేటలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గురువారం అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దేవానంద్ మాట్లాడుతూ ప్రాణాల్ని సైతం తృణ ప్రాయంగా అర్పించిన మహానుభావుడిని భావితరాలు సదా స్మరించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ ఉద్యోగులు కె. చిన్నపరెడ్డి, సంజయ్, జి. అచ్చమ్మచ పి. కోటేశ్వరమ్మ, కల్యాణి, ఎం. కిరణ్, సుశీల్‌రావు, దుర్గాబాబు పాల్గొన్నారు.



జిల్లా కేంద్ర గ్రంథాలయంలో అమరజీవి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దేవానంద్, ఉద్యోగులు



జెడ్పీలో అమరజీవి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీఈవో మోహనరావు

జెడ్పీ కార్యాలయంలో....

తెలుగువారికి ప్రత్యేక రాష్ట్రం కావాలని ఆమరణ నిరాహారదీక్షతో ప్రాణత్యాగం చేసిన పొట్టి శ్రీరాములు చిరస్మరణీయుడని జెడ్పీ సీఈవో జె. మోహనరావు కొనియాడారు.

జెడ్పీ కార్యాలయంలో గురువారం అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మోహనరావు మాట్లాడుతూ మహాత్మాగాంధీ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని, తెలుగు మాట్లాడే ప్రజల కోసం ప్రత్యేక రాష్ట్రం కావాలని ఆమరణ నిరాహార దీక్షతో అనుకున్న సాధించిన గొప్ప మనిషి అని కొనియాడారు. ఆయన జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకుని, నేటి యువతరం నేర్చుకోవాల్సింది ఎంతో ఉందని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీ పరిపాలనాధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

అవోపా ఆధ్వర్యంలో...

భాషా ప్రయుక్త రాష్ట్ర సాధన కోసం ప్రాణాల్ని అర్పించిన పొట్టి శ్రీరాములు త్యాగం ఎన్నటికీ మరువరాదని అర్యవైశ్య అఫీషియల్స్-ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా) అధ్యక్షుడు కె.వి.బ్రహ్మాం తెలిపారు. గురువారం అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా సంగడిగుంటలోని శ్రీకన్యకా పరమేశ్వరి అమ్మవారి గుడి వద్ద ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేవీ బ్రహ్మాం మాట్లాడుతూ అమరజీవి త్యాగం, అకుంఠితదీక్షను యువత అనుసరించాలని సూచించారు. అవోపా కోశాధికారి మహంకాళి శ్రీనివాసరావు మాట్లాడుతూ అహింసా మార్గంలో ఆంధ్ర రాష్ట్రాన్ని సాధించిన పొట్టి శ్రీరాములు త్యాగధనుడని, ఆయన జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారిక కార్యక్రమంగా జరపడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో అవోపా కార్యదర్శి రాధాకృష్ణయ్య, నారాయణ, రమణానంద్, సాయి రమేష్, రఘువీర్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



సంగడిగుంటలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న అవోపా ప్రతినిధులు

పొట్టి శ్రీరాములు త్యాగం అసమానం

కొరిటెపాడు(గుంటూరు): ఆంధ్ర రాష్ట్రం కోసం అమరజీవి పొట్టి శ్రీరాములు ప్రాణాన్ని తృణ ప్రాయంగా అర్పించారని బజరంగ్ ఫౌండేషన్ సీఈఓ అంబటి మురళీకృష్ణ పేర్కొన్నారు. పట్టాభిపురంలోని బజరంగ్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు జయంతిని గురువారం నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ అకుంఠిత దీక్ష, అంతులేని మనోనిబ్బరంతో చరిత్ర పుటల్లో అప్పటి వరకు లేని 'ఆంధ్ర' అనే ఓ ప్రత్యేక రాష్ట్రాన్ని సుసాధ్యం చేసిన ధీశాలి అమరజీవి పొట్టి శ్రీరాములు అని పేర్కొన్నారు. ఆయన త్యాగం అజరామరం అని కొనియాడారు. తెలుగుజాతి అస్తిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని యావద్భారత దేశానికి చాటి చెప్పి, ప్రత్యేక రాష్ట్రమనే మహోన్నత లక్ష్య సాధనలో నిండు ప్రాణాన్ని బలిదానం చేసిన పొట్టి శ్రీరాములు జీవితం భావితరాలకు స్ఫూర్తిదాయకమని తెలిపారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణకు బాటలు వేసిన ఆయన అమరజీవిగా తెలుగుజాతి ఉన్నంత వరకు నిలిచి ఉంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బజరంగ్ ఫౌండేషన్ డైరెక్టర్లు సిద్దినేని శ్రీనివాసరావు, ఎస్.సమీర్ నందన్, జి.సుబ్బారావు, ప్రాజెక్టు మేనేజర్ సుధాకర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న అంబటి మురళీకృష్ణ

మీడియా డివైజ్ ఫీజుల వసూలుకు స్పెషల్ డ్రైవ్

అధికారులకు నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశం

నెహ్రూనగర్: నగరంలో పెండింగ్‌లో ఉన్న మీడియా డివైజ్ డిస్‌ప్లే ఫీజుల వసూళ్లపై స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని, ఫీజులు చెల్లించని సంస్థల బోర్డుల తొలగించాలని పట్టణ ప్రణాళిక అధికారుల్ని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. గురువారం కమిషనర్ క్యాంప్ కార్యాలయంలో పట్టణ ప్రణాళిక అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ బకాయిలను వార్డు సచివాలయాల వారిగా కేటాయించి, ప్లానింగ్ కార్యదర్శులకు, టీపీఎస్‌లకు లక్ష్యాల్ని నిర్దేశించాలని, ప్రతి రోజూ సమీక్ష చేయాలని సిటీప్లానర్‌ని ఆదేశించారు. ప్రభుత్వ కార్యాలయాలు, పబ్లిక్ ప్రాంతాల్లో పోస్టర్స్ అంటించినా, బ్యానర్స్ కట్టినా పోలీసు కేసు నమోదు చేయడంతో పాటు, భారీ మొత్తంలో అపరాధ రుసుం విధించాలని చెప్పారు.రోడ్డు విస్తరణ పనులు పూర్తయిన ప్రాంతాల్లో ఇంజినీరింగ్ అధికారులతో సమన్వయం చేసుకొని డ్రెయిన్ నిర్మాణ పనులు వేగంగా జరిగేలా చూడాలని చెప్పారు. నూతన నిర్మాణాలు చేసే భవనాల దుమ్ము చుట్టుపక్కల పడకుండా గ్రీన్ పరదాలు ఏర్పాటు చేసుకునేలా చూడాలని తెలిపారు. కోర్టు కేసుల్లో కౌంటర్లు, అఫిడవిట్లు పక్కాగా నమోదు చేయాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. సమావేశంలో సిటీప్లానర్ మూర్తి, డిప్యూటీ సిటీప్లానర్ కోటయ్య, ఏసీపీలు కాలేషా, బాబూరావు, అజయ్ కుమార్, అశోక్ కుమార్, అజయ్ కుమార్, టీపీఎస్‌లు, సర్వేయర్లు పాల్గొన్నారు.



పట్టణ ప్రణాళిక అధికారులతో సమావేశమైన కమిషనర్ కీర్తి చేకూరి

విద్యార్థి ఆత్మహత్య



శివ మృతదేహం

పట్నంబజారు: విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటనపై కేసు నమోదైంది. లాలాపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్.అగ్రహారం అడపా బజారుకు చెందిన పల్లపు శివ (19) ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. రెండు సంవత్సరాలుగా మానసికంగా ఇబ్బంది పడుతూ వైద్య చికిత్స పొందుతున్నాడు. ఈనెల 15న రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇనుప రాడ్‌కు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి రాము ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

31న జీబీఏ ఎన్నికలు

గుంటూరు లీగల్: 2023–2024 సంవత్సరానికి నూతన కార్యవర్గం ఏర్పాటుకు సంబంధించిన గుంటూరు బార్ అసోసియేషన్ ఎన్నికల్ని ఈ ఏడాది మార్చి 31న నిర్వహించాలని తీర్మానించినట్లు జీబీఏ గురువారం ప్రకటించింది. సీనియర్ న్యాయవాది ఎస్.రామ్‌మోహన్‌రావును ఎన్నికల అధికారిగా ఏకగ్రీవంగా వ్యవహరిస్తారు. దీనికి గానూ ఆయనకు గౌరవ వేతనంగా యాభై వేల రూపాయలు చెల్లించనుంది.

అభ్యర్థుల నామినేషన్ల ద్వారా వచ్చే డబ్బును ఎన్నికల నిర్వహణకు ఉపయోగించుకోవాలని జీబీఏ సూచించింది. ఎన్నికల ప్రక్రియ పూర్తి చేసి ఫలితాలు వెల్లడించే వరకు అవసరమైన వారి సహాయ, సహకారాలు తీసుకోవచ్చని పేర్కొంది.

23న కళా దర్బార్ ఉగాది పురస్కారాలు

పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలోని అన్నమయ్య కళావేదికపై ఈ నెల 23న వివిధ రంగాల్లోని విశిష్ట వ్యక్తులకు ఉగాది పురస్కారాల్ని ప్రదానం చేయనున్నట్లు కళా దర్బార్ సాంస్కృతిక సంస్థ అధ్యక్షుడు పొత్తూరి రంగారావు తెలిపారు. అరండల్‌పేటలోని కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆ రోజు సాయంత్రం 6 గంటలకు ప్రారంభమయ్యే సభలో విద్యా రంగంలో యలవర్తి కోటేశ్వరమ్మ , వైద్య రంగంలో డాక్టర్ చింతా రామకృష్ణ, సంగీతంలో బి. జ్యోతిర్మయి, నృత్యంలో స్వాతి సోమనాథ్, సామాజిక సేవలో కె.పి. రంగారావు, కళా రంగంలో అంబటి మధుమోహన్‌కృష్ణ, ఆధ్యాత్మికతలో పాతూరి నాగభూషణం, సంక్షేమ రంగంలో చాగంటి పరమేశ్వరరెడ్డికి పురస్కారాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ముందుగా అంతర్జాతీయ నృత్య కళాకారిణి స్వాతి సోమనాథ్ ఆధ్వర్యంలో కిన్నెరసాని నృత్య ప్రదర్శన ఉంటుందని తెలిపారు. కళాభిమానులు పాల్గొనాలని ఆయన కోరారు. సమావేశం అనంతరం ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బాలస్వామి, బి. చంద్రబాబు, జి. రమేష్ బాబు, సూర్యప్రకాశ్, కె.బాబూరావు పాల్గొన్నారు.



ఆహ్వాన పత్రాన్ని ఆవిష్కరిస్తున్న రంగారావు తదితరులు

27 నుంచి వానపాముల ఎరువు తయారీపై శిక్షణ

గుంటూరు రూరల్: నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్, కృషి విజ్ఞాన కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో వానపాముల ఎరువుల తయారీపై రైతులకు మూడు రోజుల శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ సుబ్రహ్మణ్యం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. షెడ్యూల్ కులాలకు (ఎస్సీ) చెందిన రైతులకు ఈ నెల 27 నుంచి 29వ తేదీ వరకూ శిక్షణ తరగతులు ఉంటాయని పేర్కొన్నారు. పేర్లను ఈనెల 20వ తేదీలోపు 9490035258, 9989051559 నంబర్లకు ఫోన్ చేసి, నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు.

'అభయం' యాప్‌తో మహిళలకు రక్షణ

పట్నంబజారు: మహిళల రక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన అభయం యాప్‌ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని డీటీసీ షేక్ కరీమ్ సూచించారు. ఆండ్రాయిడ్ సెల్‌ఫోన్ల ప్లే స్టోర్‌లో యాప్ అందుబాటులో ఉందని తెలిపారు. డౌన్‌లోడు చేసుకున్న తరువాత అందులో వివరాలు నమోదు చేయాలని చెప్పారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం కలిగిన ట్రాకింగ్ పరికరాన్ని ఆటోలు, ఇతర ప్రజా రవాణా వాహనాల్లో అమరుస్తున్నట్లు తెలిపారు. ప్రయాణికులు బయల్దేరిన సమయంలో వాహనంలో ఉన్న క్యూఆర్‌కోడ్ స్కాన్ చేసినా, వాహనం నంబరు నమోదు చేసినా డ్రైవర్‌కు సంబంధించిన పూర్తి వివరాలు వస్తాయని, అనంతరం గమ్యస్థానాన్ని అందులో నమోదు చేయాలని సూచించారు. దీని తరువాత మూడు రూట్లు అందులో కనిపిస్తాయని, వాటిల్లో కాకుండా వేరే రూటులో డ్రైవర్ వెళుతున్న క్రమంలో అభయం పరికరంలో ఉన్న రెడ్ బటన్ నొక్కితే పోలీసు కంట్రోల్ రూమ్‌కు అలర్ట్ వెళుతుందని వివరించారు. తక్షణమే వాహనం నిలిచిపోవడంతోపాటు, సమీపంలోని స్టేషన్‌కు ఆదేశాలు జారీ అవుతాయని తెలిపారు. జీపీఎస్ లొకేషన్ ట్రాకింగ్ సిస్టమ్ ద్వారా వాహనం గుర్తించి మహిళల్ని రక్షించనున్నట్లు ఆయన వివరించారు.

బడ్జెట్‌పై ప్రజావాణి

రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై ప్రజల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. విద్య, వైద్యానికి భారీ కేటాయింపులపై విద్యావేత్తల నుంచి ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. బీసీ సంక్షేమానికి పెద్దపీట వేయడంపై ఆయా వర్గాలు సీఎం జగన్ ఆధ్వర్యంలోని ప్రభుత్వాన్ని, ఆయన దార్శనికతను అభినందిస్తున్నాయి. బడ్జెట్‌పై మేధావులు, వివిధ వర్గాల అభిప్రాయాలు...

–సాక్షి, నెట్‌వర్క్

అంబేడ్కర్ అడుగుజాడల్లో రూపకల్పన



అంబేడ్కర్ అడుగుజాడల్లో నడుస్తూ సంక్షేమ రాజ్యాంగానికి అర్థం కలిస్తూ ఎస్సీలు, ప్రధానంగా మహిళల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ బడ్జెట్ ప్రవేశపెట్టం అభినందనీయం. ఏ రాష్ట్రం అయితే విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తుందో అది అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుంది. ఇదే కోవలో సీఎం వై.ఎస్. జగన్ పాలనలో ఏపీ కూడా భవిష్యత్తులో అన్ని రంగాల్లో ముందుంటుంది. ఆయన నిర్ణయాలతో రాష్ట్రం దేశంలోనే ఆదర్శమైన రాష్ట్రంగా విరాజిల్లుతోంది.

–డాక్టర్ గోళ్లమూడి రాజసుందరబాబు,
ఐడియల్ దళిత్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు

ఎస్సీలు ఆర్థికంగా ఎదిగేందుకు దోహదం



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో బడుగు, బలహీన వర్గాల వారికి అధిక ప్రాధాన్యత కల్పించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలు ఆర్థికంగా ఎదిగేందుకు, వారి జీవన విధానం మార్చుకునేందుకు ప్రస్తుత బడ్జెట్ అందరికి ఎంతో ఉపయోగకరంగా ఉంది. సీఎం వైఎస్ జగన్ పాలనలో అన్ని వర్గాలు అభివృద్ధి చెందుతారనే విషయం ఈ బడ్జెట్ స్పష్టంగా తెలియజేస్తోంది.

–సోమి కమల్,
రెల్లి సామాజిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు

వ్యవసాయ రంగానికి తగ్గింపులు..

వ్యవసాయ రంగానికి ఉపయోగపడని రాష్ట్ర బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి బుగ్గల రాజేంద్రప్రసాద్ ప్రవేశపెట్టారు. బడ్జెట్లో గతం కంటే రూ. 2000 కోట్లు వ్యవసాయ శాఖకు కేటాయింపులు తగ్గించారు. 62 శాతం ప్రజలు వ్యవసాయ, వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవిస్తుంటే బడ్జెట్ పెంచాల్సి ఉండగా తగ్గించారు.

– కంచుమాటి అజయ్ కుమార్,
జిల్లా కార్యదర్శి, ఏపీ రైతు సంఘం

అభివృద్ధికి దోహదపడని బడ్జెట్..

రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్ రాష్ట్ర అభివృద్ధికి దోహదపడే విధంగా లేదు. రాజధాని నిర్మాణానికి నిధులు కేటాయింపులు ఏ మాత్రం లేవు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ కాకుండా తగు చర్యల ప్రస్తావన లేదు. బడ్జెట్లో రాష్ట్రంలోని యువతకు ఉపాధి కల్పించే చర్యలు చేపట్టలేదు. కీలకమైన వ్యవసాయ రంగానికి, సాగునీటి ప్రాజెక్టులకు గత బడ్జెట్ కంటే నిధులు కేటాయింపు తగ్గించారు.

– పాశం రామారావు,
సీపీఎం జిల్లా కార్యదర్శి

అద్భుతమైన బడ్జెట్...



రాష్ట్ర ప్రభుత్వం పేదల పక్షపాతిగా అద్భుతమైన బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. రైతు, మహిళలు, విద్యార్థి, విద్య, వైద్య రంగాలకు సీఎం వైఎస్ జగన్ తొలి నుంచి ఎంతో ప్రాధాన్యతిస్తారు. అన్నివర్గాల ప్రజల సంక్షేమాన్ని కాంక్షిచేలా బడ్జెట్ ఉంది. పేద, మధ్య తరగతి వర్గాలకు మేలు చేకూర్చేలా నిర్ణయం తీసుకున్నారు.

– చెన్నంశెట్టి చక్రపాణి, విశ్రాంత ఎస్పీ

బ్రాహ్మణుల నియామకం అభినందనీయం



దేవాలయ కమిటీల్లో బ్రాహ్మణుల నియామకాన్ని కేబినెట్‌లో ఆమోదించిన ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డికి యావత్ బ్రాహ్మణ్యం రుణపడి ఉంటుంది. బడ్జెట్‌లో రూ. 346 కోట్లు కేటాయించి నిరుపేద బ్రాహ్మణులకు ప్రభుత్వం అండగా ఉండటం హర్షణీయం. బ్రాహ్మణ జాతి అభివృద్ధికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రికి ఎల్లపుడూ అండగా ఉంటాం.

– కోనూరి సతీష్‌శర్మ,
ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

కరెన్సీపై అంబేడ్కర్ బొమ్మను ముద్రించాలి

నెహ్రూనగర్: భారత కరెన్సీపై అంబేడ్కర్ బొమ్మను ముద్రించాలని ఏపీ ఎమ్మార్పీస్, అంబేడ్కర్ ఆశయ సాధన కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు కాల్వ రవి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. బ్రాడీపేటలోని ఓ హోటల్‌లో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. అంబేడ్కర్ బొమ్మను కరెన్సీపై ముద్రించాలని గత పదేళ్లుగా ఉద్యమం చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ప్రస్తుతం ఏపీ అసెంబ్లీ సమావేశాల్లోనూ ఈ మేరకు తీర్మానం చేసి పార్లమెంట్‌కు పంపాలని కోరారు. దళిత ఎంపీలు, ఎమ్మెల్యేలు, మంత్రులు ఈ అంశంపై చట్ట సభల్లో మాట్లాడాలని విన్నవించారు. ఇటీవల కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కూడా కరెన్సీపై అంబేడ్కర్ బొమ్మ ముద్రించాలనే అంశంపై మాట్లాడటం అభినందనీయమని తెలిపారు. బొమ్మ ముద్రణపై టీడీపీ, జనసేన పార్టీలు స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో అంబేడ్కర్ ఆశయ సాధన కమిటీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జడ్డా జ్యోతిరాజు, మహిళా అధ్యక్షురాలు ఒంటరి విజయమ్మ, మందా మార్కు, జడ్డా దాసు, నరేంద్ర, కోటి, వంశీ, నాగేష్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కాల్వ రవి తదితరులు

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

తెలగాయపాలెం(కాకుమాను): ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ కార్యకర్త సిద్దెల కోటేశ్వరరావు కుటుంబానికి గురువారం పార్టీ మంజూరు చేసిన నగదును రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి మేకతోటి దయా సాగర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కోటేశ్వరరావు కుటుంబానికి, స్థానిక శాసన సభ్యురాలు మేకతోటి సుచరిత ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి దృష్టికి తీసుకువెళ్లి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో పార్టీ తరఫున రూ.5లక్షలను మంజూరు చేయించినట్లు తెలిపారు. నమ్ముకున్న వారికి పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ నల్లమోతు శివరామకృష్ణ, కాకుమాను జెడ్పీటీసీ ముజావర్ షేక్ గుల్జార్ బేగం, ఎంపీపీ రామినేని శ్రీనివాసరావు, సర్పంచ్ చింతల రాహేలమ్మ, సర్పంచ్‌ల సంఘం మండలాధ్యక్షుడు వింతా రాఘవరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు పెదపూడి కపిల్, గేరా పున్నారావు, గ్రామ సచివాలయ మండల కన్వీనర్ శ్రీనివాసరావు, అసదుల్లా, వీరయ్య, వీరాస్వామి, శ్రీనివాసరావు, మువ్వ చిన్న తదితరులు ఉన్నారు.



నగదు అందజేస్తున్న విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి మేకతోటి దయా సాగర్

పరీక్షకు 88 మంది హాజరు

పెదనందిపాడు: ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం పరీక్షలు మొదటి రోజు ప్రశాంతంగా ముగిశాయి. గురువారం ఉదయం స్థానిక పెదనందిపాడు ఆర్ట్స్ అండ్ సైన్సెస్ కళాశాలలో జరిగిన పరీక్షలకు 90కి గాను 88 మంది హాజరయ్యారని, ఇద్దరు గైర్హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ పాతూరి శ్రీనివాస్, డిపార్ట్‌మెంటల్ అఫీసర్ వనిత తెలిపారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.